# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-03-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో ఓఎన్జీసీ పైపులైను కారణంగా ఉపాధి కోల్పోయిన వారిని అన్ని విధాలా ఆదుకుంటామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.**
2. **ఉపాధ్యాయుల నియామకం కోసం ప్రకటించిన డిఎస్సీ-2024 పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు.**
3. **అర్హులైన పేదలకు తెల్ల రేషన్ కార్డులు ఇవ్వడంతో సహా పలు కీలక నిర్ణయాలకు తెలంగాణా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
4. **తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి 5 లక్షల కోట్ల రూపాయలు అందించామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.**
5. **మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్‌లో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ఓఎన్జీసీ పైపులైను కారణంగా ఉపాధి కోల్పోయిన వారిని అన్ని విధాలా ఆదుకుంటామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఓఎన్జీసీ పైపులైను కారణంగా ఉపాధి కోల్పోయిన 23 వేల 459 కుటుంబాలకు ఐదో విడతగా 161.86 కోట్ల రూపాయలను తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి మీట నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి జమచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..ఇప్పటివరకూ ఐదు విడతల్లో 647.44 కోట్ల రూపాయలను మత్స్యకారుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఒక్కో మత్స్యకార కుటుంబానికి నెలకు 11 వేల 500 చొప్పున అందిస్తున్నామని పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 6 వేల ఒక వంద ఉపాధ్యాయుల నియామకం కోసం ప్రకటించిన డిఎస్సీ-2024 పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. డిఎస్సీ-2024 పరీక్ష కోసం ఫిబ్రవరి 25 వ తేదీ వరకు ఆన్ లైన్ లో దరఖాస్తులు స్వీకరించగా ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 15 వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, పలు కారణాల వల్ల ఈ పరీక్షలను మార్చి 30 వ తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు నిర్వహిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త షెడ్యూల్ ప్రకారం

రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించేలా టైమ్ టేబుల్‌ను రూపొందించామని, ఏప్రిల్ 7న ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ), పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ప్రిన్సిపల్ పోస్టులకు ఆంగ్ల భాష ప్రావీణ్య పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈనెల 20 నుంచి పరీక్ష కేంద్రాల ఎంపికకు అభ్యర్థులు వెబ్ ఐచ్ఛికాలు నమోదు చేసుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని, హాల్ టిక్కెట్లను మార్చి 25 వ తేదీ నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

---------------------------

అర్హులైన పేదలకు త్వరలో తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ మంత్రి వర్గం నిర్ణయించిందని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో నిన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మంత్రి వర్గ నిర్ణయాలను మంత్రి పాత్రికేయులకు వివరిస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని మొదటి విడతగా 4.56లక్షల ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సహా 16 కార్పొరేషన్ల ఏర్పాటుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందన్నారు. మరికొన్ని గ్యారంటీలు అమలు చేయాలని నిర్ణయించామని రెండు రోజుల్లో 93శాతం రైతు బంధు ఇవ్వాలని నిర్ణయించామని వివరించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో ఏడాదికి 6వేల రూపాయల చొప్పున వేస్తూ.. అండగా ఉంటోందని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ బూత్ స్థాయి అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంలో నిన్న ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వచ్చే ఐదేళ్లలో దేశమంతటా.. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా మంచినీరు ఇస్తామని... ఇప్పటికే 14 కోట్ల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఇప్పటికే రాష్ట్రానికి 5లక్షల కోట్ల రూపాయలు అందించామని అమిత్ షా వివరించారు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం సులభంగా అనుమతులను, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం కలవచర్ల గ్రామంలో పారిశ్రామిక వాడ వద్ద రూ.20 కోట్ల 65 లక్షలతో చేపట్టనున్న పనులకు శంఖు స్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాజానగరం లో 100 ఎకరాల స్థలంలో 300 పైగా పరిశ్రమల ఏర్పాటు చేయడం కోసం చర్యలు చేపట్టామన్నారు. భవిష్యత్‌లో ఇక్కడ పెద్ద ఎత్తున యువతకి ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు అవకాశం ఉందని అన్నారు. త్వరలో ఇండస్ట్రియల్ పార్కుకి అత్యున్నత స్థాయి లో మౌలిక సదుపాయాలు అందుబాటులో తీసుకుని రావడం జరుగుతుందనీ తెలిపారు.

---------------------------

తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో 'మహాలక్ష్మి స్వశక్తి మహిళ' పథకాన్ని నిన్న అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీవ్ ఆరోగ్యశ్రీ ఆ పథకాన్ని 10లక్షల రూపాయలకు పెంచామని చెప్పారు. మహిళలకు భారం కాకూడదని 5 వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా వంద మార్కెట్లు నిర్మించి, వారి ఉత్పత్తుల విక్రయం కోసం స్టాళ్లు ఏర్పాటు చేయిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని రెండు  అసెంబ్లీ నియోజకవర్గాలకు  సమన్వయ కర్తలను  నియమిస్తూ నిన్న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. చిలకలూరిపేట సమన్వయకర్తగా కావటి మనోహర్‌నాయుడు, గాజువాక సమన్వయకర్తగా మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే  కర్నూలు మేయర్‌గా సి. సత్యనారాయణమ్మను నియమిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొంది.

---------------------------

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతోనేఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుతోనే అమలు చేస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి  తానేటి వనిత తెలిపారు. ద్వారకాతిరుమలలో మండల పరిధిలో నిర్వహించిన వైఎస్సార్ చేయూత 4వ విడత పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 4 వేల 202 మంది లబ్ధిదారులకు 7 కోట్ల 87లక్షల 87వేల 500 రూపాయల చెక్కు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా హెూంమంత్రి మాట్లాడుతూ.. 45 నుంచి 60 సంవత్సరాల్లోపు వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళ లందరికీ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి 18 వేల 750 రూపాయల చొప్పున నాలుగు విడతల్లో ఒక్కొక్కరికి  75వేలు చొప్పున అందచేసి ఆర్థిక భరోసా కల్పించినట్టు చెప్పారు. పేదింటి విద్యార్థుల కోసం అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యాదీవెన. వసతి దీవెన వంటి పథకాలతో పేదల విద్యకు పెద్దపీట వేసి ప్రోత్సహిస్తున్నామని తానేటి వనిత వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్లో ఈరోజు జరగనున్న ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం భౌతిక శాస్త్రం పేపర్-2, ఆర్థిక శాస్త్రం పేపర్-2 పరీక్షలకు సెట్-2 ప్రశ్నాపత్రాన్ని,..... తెలంగాణాలో ఈరోజు జరగనున్న ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం రసాయన శాస్త్రం పేపర్ -1, కామర్స్ పేపర్ -1 పరీక్షలకు సెట్-సి ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేసినట్లు ఇరు రాష్ట్రాల ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణికి తెలియజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలోని 352 కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో  2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది.  6, 11వ తరగతుల్లో కొత్తగా ప్రవేశాలు, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు మార్చి 12 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ , పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులు. కేజీబీవీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లికేషన్లు స్వీకరిస్తారు.

---------------------------

జేఎన్‌టీయూ కాకినాడ  ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ - ఏ. పీ. ఈ. ఏ. పీ. సెట్ -2024 నోటిఫికేషన్‌ను  విడుదల చేసినట్లు సెట్ ఛైర్మన్, ఉప కులపతి జీవీఆర్ ప్రసాదరాజు  ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 12 నుంచి ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మే 13 నుంచి 16 వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు, మే 17 నుంచి 19 వరకు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

---------------------------

ఎలక్ట్రిక్ బస్సుల్లోనూ మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. హైద్రాబాద్లో నిన్న 25 మెట్రో ఎలెక్ట్రిక్ బస్సులను మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో రవాణా సంస్థ అయిన ఆర్టీసీకి పనర్ వైభవం తీసుకొచ్చామన్నారు. టీస్ఆర్టీసీ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వ సహాయం అందిస్తూనే ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వం కాపాడుకుంటుందని అన్నారు. 25 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చామని.. ఆగస్టు నాటికి మొత్తం 500 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలను మూడు నెలల్లోనే అమలు చేశామని తెలిపారు.

---------------------------

సముద్ర జలాల నాణ్యతను పర్యవేక్షించడంతో పాటు సముద్ర తీర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై పరిశోధనలు చేసేందుకు జాతీయ తీరప్రాంత పరిశోధనా కేంద్రం – ఎన్సీసీఆర్ ప్రధాన భూమిక పోషిస్తుందని కేంద్ర భూ విజ్ఞాన శాఖ మంత్రి కిరన్ రిజిజు అన్నారు. నిన్న విశాఖపట్నంలోని యారాడ డాల్ఫిన్ నోస్పై కొత్తగా నిర్మించిన కేంద్ర భూ విజ్ఞాన శాఖ అనుబంధ సంస్థ జాతీయ తీరప్రాంత పరిశోధనా కేంద్రాన్ని ఢిల్లీ నుంచి ఆయన దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించారు.

========================